# అంశ

ఓవర్ బ్రిడ్జి మెట్లు దిగుతూ బ్రిడ్జి పక్కనే ఉన్న నైజాం హోటల్లోకి తొంగిచూశాడు రెడ్డప్ప. హోటల్‌లోని గోడ గడియారంలో సమయం తొమ్మిదీ అయిదయింది.రేడియోలోంచి ఇంగ్లీషు వార్తలు వినిపిస్తున్నాయి. వార్తలు విందామనుకుని ఆగి ఇనప కమ్మీని పట్టుకుని నిలబడ్డాడు. పెద్దగా ట్యూన్ అయిన వాల్యూంలో అక్కడో మాట ఇక్కడో మాట తప్ప వార్తలు స్పష్టంగా వినిపించటంలేదు. రెండు నిమిషాల తర్వాత వార్తల గొడవను, కిందినుంచి పారే మురికికాలవ దుర్వాసనను భరించటం కష్టమయింది. ఉండలేకపోయాడు. మెట్లు దిగి రోడ్డు మీదికొచ్చాడు. ఆకలి వేస్తోంది. అప్పుడే ఇంటికి వెళ్ళామనిపించటంలేదు. పదిదాటితే కాని అమ్మ నిద్రపోదు. మెలకువగా ఉంటే తను ఊరంతా బలాదూర్‌గా తిరిగివచ్చినందుకు కడుపునిండిపోయేలా తిడుతుంది. ఉద్యోగం సంపాదించుకోటానికి తను సరిగా ప్రయత్నం చేయటంలేదనుకుంటోంది. బయటి పరిస్థితులు ఆమెకు తెలియవు. ఉద్యోగం దొరకటం అంత తేలికకాదు అంటే నమ్మదు. విడమర్చి చెప్పబోతే వినదు. ఆవిడ తిట్టేతిట్లకు మొదట్లో రంపపు కోతలాంటి బాధ అనుభవించినా క్రమంగా అలవాటు పడిపోయాడు. రెడ్డప్ప ఎం.ఎ. పూర్తిచేసి ఇది అయిదో సంవత్సరం. ఈ అయిదు సంవత్సరాలలో ఏ చిన్న ఉద్యోగం చేయటానికైనా సిద్ధపడి ఎన్నో ప్రయత్నాలు చేశాడు. ఇంటర్వ్యూలకని ఇరవై ఊళ్లకు పైగా తిరిగాడు. పోస్టల్ ఆర్డర్లకు, చార్జీలకు అతను ఎం.ఎ. చదవటానికి అయినంత ఖర్చు అయింది. చాలా మంది చుట్టూ రికమెండేషన్లకని తిరిగాడు. ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది. ప్రతిసారీ చుక్కెదురయింది. ఈ ప్రయత్నాలలో అతనికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చే వయసు దాటిపోయింది. అతని తండ్రి వెంకట్రాయమ్య స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఆయనకు రెడ్డప్ప తరువాత పెళ్లికి ఎదిగొచ్చిన కూతురు సీత కాక ఇంకోడున్నాడు. చివరివాడు ఇంటర్ చదువుతున్నాడు. ఆయనకు నెలకు నాలుగు వేల వరకు వడ్డీ ఇచ్చుకోవలసిన అప్పులు, ఒక సంవత్సరం సర్వీసు మిగిలి ఉన్నాయి. ఆంధ్ర యూనివర్సిటీ వాల్తేరు పంపించి ఎం.ఎ. చదివిస్తున్నప్పుడు చదువుపూర్తి కాగానే రెడ్డప్ప ఏదో ఒక మంచి ఉద్యోగం సంపాదించుకొని తనకు అన్ని విధాలా

సహాయంగా ఉంటాడని ఆశపడ్డాడు. ఆయన చేయవలసిన ప్రయత్నాలు చేశాడు. ఒకటీ ఫలించలేదు. డబ్బిస్తే రోజుల్లో దొరికే ఉద్యోగాల గురించి విన్నప్పుడు ఆయన తొందర పడలేదు. పట్టుమని రెండువేలయినా ఇచ్చుకునే ఆర్థిక స్తోమత లేదు. అంతవరకు ఎందుకు? గంటలో వంద రూపాయలు సంపాదించే పరపతి లేదు. కనీసం అప్పుగానైనా ఇంట్లో తాకట్టు పెట్టదగినవి చాలా మట్టుకు రెడ్డప్ప వాల్తేరులో చదువుతుండగా పెట్టేసి విడిపించుకోలేక పోయాడు. సీత పెళ్లి డబ్బులకోసం ఆగిపోయింది. రేపటి గురించి ఆలోచించాలంటే ఆయనకు భయం వేస్తుంటుంది. భయాన్ని తప్పించుకోడానికి ఆఫీసుకు వచ్చి పనిలో నిమగ్నుడయిపోతుంటాడు, ఆదివారాలు, సెలవు రోజుల్లో కూడా.

ఇంటిల్లిపాది మేల్కొని ఉన్నప్పుడు ఇంట్లో మెలగటానికి రెడ్డప్పకు అభిమానం అడ్డం వస్తుంటుంది. తప్పు చేశానన్న భావం కాళ్లకు చుట్టుకుంటూ ఉంటుంది. తండ్రి కష్టపడి సంపాయిస్తుంటే తను కూర్చుని తినటానికి వేసే బాధ కలుక్కుమంటుంటే రోజులో ఎక్కువ భాగం గ్రంథాలయంలో గడిపేస్తుంటాడు. రాత్రి గ్రంథాలయం మూసే వరకు ఉండి ఓవర్ బ్రిడ్జి మీదకు వెళ్తాడు. దాదాపు ఆ సమయానికే కృష్ణయ్య అక్కడికి వస్తుంటాడు. నైజాం హోటల్‌లో వన్‌బైటూ టీ తాగి ఇద్దరూ కలిసి తాలూకాఫీసు ముందున్న పచ్చికలో కూర్చుని తొమ్మిదిన్నరా, పది వరకు కబుర్లు చెప్పుకుంటూ ఉండిపోతారు. ఎక్కువసార్లు టీ డబ్బులు కృష్ణయ్య పెట్టుకుంటాడు. ఆవేళ కృష్ణయ్య ఓవర్ బ్రిడ్జి మీదకు రాలేదు.

ఓవర్‌బ్రిడ్జ్ దాటి కృష్ణయ్య ఇంటికి వెళ్దామనుకుని రైలుపేట సెంటరు వరకు వచ్చాడు రెడ్డప్ప. అవుతున్న ఆకలి భరించలేక మనసు మార్చుకుని వెనక్కి తిరిగి ఇంటిదారి పట్టాడు. రెడ్డప్ప ఇంటికి చేరుకునే సరికి ఇంట్లోని గోడగడియారం పది గంటలు కొట్టింది. వెంకట్రామయ్య వరండాలోని మడత కుర్చీలో కూర్చుని చుట్ట కాల్చుకుంటున్న వాడల్లా రెడ్డప్ప అడుగుల చప్పుడుకు నోట్లోంచి చుట్టతీసి వరండాకు అవతల పడేలా విసిరి "ఎవరది?" అడిగాడు. ఆయనకు రాత్రుళ్లు కళ్లు సరిగా కనిపించవు. వరండాలో లైటు లేదు. మధ్య గదిలోని వెలుగు ఓరగా వరండా మీదికొచ్చి పడుతోంది.

వరండా మీదికొచ్చి, "నేను నాన్నా" అన్నాడు రెడ్డప్ప. రెడ్డప్ప వరండాలో చెప్పులొదిలి లోపలికి వెళ్ళబోతుంటే "అరేయ్ బాబ్జీ, మాట" పిలిచాడు. వెంకట్రామయ్యతో మాట్లాడడానికి రెడ్డప్ప భయపడుతుంటాడు.

"ఈ సాయంత్రం చలపతిరావు వచ్చాడురా."

"ఇక్కడికా?"

"ఆఫీసుకు వచ్చాడు. నువ్వెప్పుడో అతని దగ్గర డబ్బులు తీసుకున్నావట. ఇంతవరకు తిరిగివ్వలేదన్నాడు."

"నవంబర్‌లో హైదరాబాద్ ఇంటర్వ్యూకు వెళ్లినప్పుడు తీసుకున్నాను" అన్నాడు మెల్లగా. గొంతులో తడి ఆరిపోయింది.

"ఎంత తీసుకున్నావు?"

"యాభయి."

"వంద అన్నాడే?"

"వంద అన్నాడా?" ఆశ్చర్యం వేసింది. రెండు క్షణాలు ఆగి, "వడ్డీ వేసుంటాడనుకుంటాను" అన్నాడు.

"వడ్డీ వేస్తానని ముందే నీతో చెప్పాడా?"

"లేదు. చెప్పలేదు."

"రేపు వెళ్లి అడుగు. నాలుగయిదు రోజుల్లో డబ్బు లివ్వమన్నాడు." అని దీర్ఘంగా నిట్టూర్చి, "రేపు అతన్ని కలిసి నా దగ్గరికి రావద్దని చెప్పు" అన్నాడు వెంకట్రామయ్య.

రెడ్డప్ప తలూపి "సరే" అని లోపలికి నడచి సరాసరి స్నానాల తొట్టి దగ్గిరకు వెళ్లి చెంబుతో నీళ్లందుకుని కాళ్లూ చేతులూ ముఖం కడుక్కుని, తువ్వాలుతో ముఖం తుడుచుకుంటూ మధ్య గదిలోకి వచ్చాడు.

మధ్య గదిలో గొడవారగా ఉన్న మాసిపోయిన నవారు మంచం మీద సీత పడుకుని వారపత్రిక చదువుతోంది. రెడ్డప్ప చప్పుడు కాకుండా మంచం దగ్గరకొచ్చి చెల్లెలి చేతిలోని పత్రిక చటుక్కున లాక్కుని మంచం మీద కూర్చున్నాడు. సీత లేచి కూర్చుని "రేయ్ అన్నయ్యా.... సీరియల్ చదువుతున్నాను. సగంలో ఉన్నాను. పూర్తిచేసి అయిదు నిమిషాల్లో ఇచ్చేస్తానురా" అంటూ పత్రిక దొరకపుచ్చుకోటానికి ప్రయత్నించింది.

రెడ్డప్ప వీలుకానీయలేదు. "సినిమా బొమ్మలు చూసి ఇస్తాను." అన్నాడు.

"త్వరగా చూడు మరి........"

పత్రిక పేజీలు తిరగవేస్తూ "అమ్మ నిద్రపోయిందా?" అడిగాడు.

"నువ్వు వచ్చే ముందే నిద్రపోయింది. ఇప్పటిదాకా ఇక్కడే కూర్చుని ఒకటే నస [illegible]"

"ఏమంటుంది?"

"పాత రికార్డే. నిన్ను ఎం.ఎ.చదివించి నాన్న డబ్బులు తగలేశాడట" అని పకపక నవ్వుతూ "ఎం.ఎ. చదివిన వాళ్లకు బంట్రోతు పని ఇవ్వకూడదని రూలు ఎక్కడుంది? అని నన్ను అడిగితే ఆ రూల్సు గీల్సూ నాకేమి తెలియవు. నాన్నను అడుగు" అన్నాను. రేపటి నుండి నీతోనూ నాన్నతోనూ మాట్లాడదట. మీ ఇద్దరినీ చూస్తుంటే ఆవిడ ఒళ్లు మండుకొస్తుందట. త్వరగా బొమ్మలు చూసి ఇచ్చెయ్యరా."

"ఇచ్చేస్తాను గాని నాకు అన్నం పెట్టగలవా?"

"ఇంట్లో బియ్యం లేక అన్నం వండలేదురా" అంది నెమ్మదిగా.

సీత మాటలోని చల్లదనానికి రెడ్డప్ప ఆకలి ఒక్కసారిగా చచ్చిపోయింది. నెల చివరి వారంలో రెండు మూడు రోజుల పాటు పస్తులుండటం ఆ ఇంటికి కొత్తేమీ కాదు. పత్రిక సీతకు ఇచ్చేస్తూ, "నీచేత్తో చెంబుడు మంచినీళ్లు తెచ్చిపెట్టు" అన్నాడు.

మంచం దిగి వంట గదిలోకి వెళ్లి చెంబునిండా నీళ్లుతెచ్చి రెడ్డప్పకిస్తూ "చెప్పటం మర్చిపోయానురా. నీకేదో ఉత్తరం వచ్చింది. ఇస్తానాగు." బల్ల సొరుగులోంచి ఉత్తరం తీసి అతనికందించింది.

చెంబు నీళ్లు ఖాళీచేసి చెంబు మంచం కిందపెట్టి కవరు చించి అందులో ఉన్న కాయితాన్ని బయటకు లాగి చదువుతుంటే అతని ముఖంలో కదులుతున్న సంతోషాన్ని చూసి, "అపాయింట్‌మెంట్ ఆర్డరా?" అడిగింది.

"కాదు ఇంటర్వ్యూ కాల్."

"ఎక్కడ?"

"వరంగల్‌లో. హిస్టరీ లెక్చరర్ పోస్టుకు. రేపు ఉదయం పదిన్నరకు ఇంటర్వ్యూ ఉంది. ఈసారైనా నా అదృష్టం బావుండి........" అంటుంటే సీత ఏదో అనబోయిందికాని అనలేదు. అన్నయ్యకు మంచి జరగాలి అనుకుంది.

"సీతా."

సీరియల్‌లోకి తలదూర్చిన సీత తలెత్తకుండా "ఊ" అంది.

"నీ దగ్గర డబ్బు లేమయినా ఉన్నాయా?"

"లేవు."

"నిజంగా?"

పత్రిక పక్కనే పెట్టి అతని ముఖంలోకి చూసి నీరసంగా నవ్వి, "పోయిన నెల

చివర్లో నువ్వు నాకిచ్చిన రెండు రూపాయల్లో ఇంకా అర్ధ రూపాయి, స్లయిడ్స్ కొనుక్కుందామని ఉంచుకున్నాను. ఆ అర్ధ రూపాయి కావాలంటే ఇస్తాను" అంది.

తల అడ్డంగా ఆడించి బయటకు వచ్చాడు రెడ్డప్ప.

పోలీసు స్టేషనులో పదకొండు కొట్టే సమయానికి కృష్ణయ్య ఇంటి అరుగు మీద గోడకు చేరగిలబడి కూర్చొని సిగరెట్ వెలిగించాడు. అలా కూర్చున్నాడో లేదో రెడ్డప్ప వచ్చి కృష్ణయ్యకు ఎడం పక్కగా కూర్చున్నాడు. కృష్ణపక్షమి చంద్రుడు ఎదురింటి మేడమీద కూర్చుని ఉన్నాడు. గాలికోసం మేఘాలు నుంచుండి పోయాయి.

"నీ గురించే అనుకుంటున్నాను, భోజనం అయ్యిందా?" అడిగాడు కృష్ణయ్య.

"అయింది" అబద్ధం చెప్పి, "సాయంత్రం ఓవర్ బ్రిడ్జిమీదకు రాలేదేం?" అడిగాడు రెడ్డప్ప.

"అర్జంట్ పని ఉండి మా కాంట్రాక్టరింటికి వెళ్లాల్సి వచ్చింది. గంటకిందటే అక్కడి నుండి వచ్చాను. నీకో శుభవార్త. మా కాంట్రాక్టర్ మేనల్లుడొకడు వచ్చే నెలలో ట్యుటోరియల్ కాలేజి పెట్టబోతున్నాడు. నీ గురించి చెప్పాను. నిన్ను తీసుకుని రేపు సాయంత్రం రమ్మనమన్నాడు. వాళ్ల మేనల్లుడిని పిలిపిస్తానన్నాడు."

"రేపు సాయంత్రం వద్దు."

"ఏం?"

"రేపు ఉదయం నాకు వరంగల్ కాలేజిలో లెక్చరర్ పోస్టుకు ఇంటర్వ్యూ ఉంది. ఇదే నా చివరి ప్రయత్నం. అటు తిరిగి ఇటు తిరిగి విసిగిపోయాను. ఈ ఊళ్లోంచి వెళ్లిపోయి కూలిపని చేసుకుని బతుకుదామనిపిస్తోంది." అని ఆగి, "నాకో చిన్న సహాయం చేసిపెట్టాలి" అన్నాడు.

"డబ్బులు కావాలి" నవ్వి, "ఎంత?" అడిగాడు.

"ఇరవయి" ఆశగా కృష్ణయ్య ముఖంలోకి చూశాడు.

నింపాదిగా సిగరెట్ తాగుతూ కృష్ణయ్య ఆలోచనలోపడి, చివరంటా కాలిన సిగరెట్ ముక్కని కాలవలో పడేలా విసిరి లేచి నిలబడి "ఇప్పుడే వస్తానుండు" అని ఇంట్లోకి వెళ్లి నిమిషం తరువాత బయటకు వచ్చి ఒక పది రూపాయల నోటును రెడ్డప్ప చేతిలో పెట్టి పక్కనే కూర్చొని, "నిన్న మా తమ్ముడు బడి జీతం కట్టడానికి వెంటనే డబ్బు పంపించమని ఉత్తరం రాశాడు. ఫస్టు వస్తేనేకాని జీతం రాదు. నీకోసారి చెప్పాను, మా దగ్గర వడ్డీకి డబ్బులిచ్చే లేబరరు ఉన్నాడని, వాడి దగ్గర ముప్ఫయి రూపాయలు

అప్పుగా తీసుకుని అందులో ఇరవయి మా తమ్ముడికి పంపించాను. నా దగ్గర పది మట్టుకు ఉన్నాయి. ఇక్కడినుండి వరంగల్‌కు రైలు టిక్కెట్టు మూడున్నరో, నాలుగో ఉంటుంది. వెళ్లిరావటానికి సరిపోతుంది" అన్నాడు.

"థ్యాంక్స్. నీకెంతో బాకీ ఉన్నాను."

"నీ మొదటి జీతంలో తీర్చేసేయి." అని నవ్వి రెడ్డప్ప భుజం మీద చేయి వేసి తడుముతూ, "ఆల్ ది బెస్టు. పదకొండుముప్పావుకో పన్నెండుకో ప్యాసింజరు ఉండాలి అది ఎక్కావంటే తెలతెలవారుతుండగా వరంగల్‌లో ఉంటావు."

రాత్రి పన్నెండున్నరకు బయల్దేరిన పాసింజరు ఉదయం ఆరు గంటలు కావస్తుండగా కాజీపేటకు దగ్గర కాసాగింది. కిటికీ పక్కనే కూర్చున్నా బండి ఎక్కిన దగ్గరి నుండి నిద్ర పట్టలేదు. చివరకు, పది నిమిషాలపాటు అలా కళ్లు మూసుకున్నాడో, లేదో కీచుకీచు మంటూ అవుతున్న బ్రేకుల చప్పుడుకు మెలకువ వచ్చింది. చటుక్కున కళ్లు తెరిచి కిటికీలోంచి బయటకు చూశాడు. బండి వేగం తగ్గిపోయింది. అవుటర్ సిగ్నల్‌లో ఎర్రదీపం వెలుగుతోంది. తెల్లబడుతున్న వెలుగు కంపార్టుమెంట్‌లోకి సన్నగా ప్రవహిస్తోంది. మంటలుగా ఉన్న కళ్లను తుడుచుకొని రుమాలుతో ముఖం తుడుచుకోబోతూ ఆగాడు. పావు గంట కిందటి వరకు తన పక్కన కూర్చున్న బెల్‌బాటమ్ పేంటు కుర్రాడు కనిపించలేదు. పైకి చూశాడు. తను బ్రీఫ్‌కేస్ పెట్టిన చోట లేదు. అతని గుండె ఝల్లుమంది. అందులో తన సర్టిఫికెట్లు అన్నీ ఉన్నాయి. రెడ్డప్ప నిద్ర మత్తు ఒక్కసారిగా వదిలింది. గుండె వేగంగా కొట్టుకుంటుంటే, కిందాపైనా ఎదుటి సీట్లవైపు చూశాడు. బ్రీఫ్‌కేస్ కనబడకపోయే సరికి గాభరా ఎక్కువయింది. తలుపు వైపు పరుగెత్తాడు.

కంపార్టుమెంట్‌లో ఎక్కువ మంది జనం లేరు. ఉన్న కొద్ది మందీ చలికి ముడుచుకొని పడుకుని ఉన్నారు. రెడ్డప్ప తలుపు దగ్గరకు రాగానే బండి ఆగింది. ఆగిన కుదుపుకు తూలి పడబోయి నిలదొక్కుకుంటుండగా తలుపు దగ్గరున్న బెల్‌బాటమ్ పేంటు కుర్రాడు బ్రీఫ్‌కేస్‌తో దూకి పరుగెత్తటం మొదలెట్టాడు.

రెడ్డప్ప బండి దిగి కుర్రాడి వెంట పరుగెడుతుంటే పక్క రైల్వే లైను మీద పరుగెడుతున్న కుర్రాడు హఠాత్తుగా ఆగి, ముందుక వంగి, కుడిచేతికందినన్ని రాళ్లు పట్టుకుని, "నా ఎనకొస్తివా రాళ్లబెట్టి కొడ్తా నా కొడక" అన్నాడు గసబెడుతూ.

బ్రేక్ వేసినట్లు రెడ్డప్ప ఆగాడు. ఆయాసంగా ఉంది. కుర్రాడి చేతిలోని ఎర్రటి రాళ్లు వణుకుతున్నాయి. వాళ్లిద్దరి మధ్య దూరం నాలుగైదు గజాలకు మించి ఉండదు.

అడుగు ముందుకు వేస్తే కుర్రాడు రాళ్లు నిజంగా విసిరేట్టే ఉన్నాడు. ఈ హఠాత్తు పరిణామం రెడ్డప్ప ఊహించలేదు. ఏం చేయాలో తోచటం లేదు. గుండె వేగంగా కొట్టుకునే చప్పుడు వినిపిస్తోంది. మెల్లగా తేరుకుని, "నిన్ను నేనేం చేయను. నన్ను రాళ్లతో కొట్టకు ఆ బ్రీఫ్‌కేస్‌లో ఒక జత గుడ్డలు, నా సర్టిఫికెట్లు తప్ప ఏమీ లేవు. నేను అబద్ధం చెప్పటంలేదు. ఈ అయిదు రూపాయలు తీసుకొని అది ఇచ్చేయి" అని తిరుగు ప్రయాణానికి ఉంచుకొన్న అయిదు రూపాయల కాయితం తీసి చేయి చాచి ముందుకు రెండడుగులు వేశాడు.

కుర్రాడు అయిదురూపాయల కాయితం వంక, రెడ్డప్ప ముఖంలోకి మార్చి మార్చి చూస్తూ వెనక్కి అడుగులు వేయసాగాడు. అతనికి రెడ్డప్ప మాటల మీద నమ్మకం కలగటం లేదు. రెడ్డప్ప ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తుంటే ఆ కుర్రాడికి భయం ఎక్కువ కాసాగింది. ఎవరైనా చూసినా వెనక నుండి తనను పట్టుకుంటారు. తన్నులు; పోలీస్‌స్టేషన్ వద్దు, అనుకుని తల అడ్డంగా ఆడించి రాళ్లు ఉన్న చేయి ఎత్తేడు. ఇంజన్ కూత వేసేసరికి ఉలికి పాటుతో ధైర్యం పట్టు తప్పింది. రాళ్లు రెడ్డప్ప మీదకు విసిరి బ్రీఫ్‌కేసుకూడా అతని వైపు విసిరి రైలు కట్టకు అడ్డంపడి పొలాల్లోకి పారిపోయాడు.

అతను విసిరిన రాళ్లలో ఒకటి మటుకు రెడ్డప్ప నుదుటికి తగిలింది. రాయి విసురుగా తగిలిన చోటు నుండి కొద్ది కొద్దిగా రక్తం కారటం మొదలయింది. రుమాలు తీసి గాయాన్ని నొక్కిపట్టుకుని నిలబడి పోయాడు. దెబ్బకు తల దిమ్మయింది. బ్రీఫ్‌కేసు వంక చూశాడు. కిందపడటంతోనే మూత తెరుచుకున్న బ్రీఫ్‌కేసులోంచి సర్టిఫికెట్లు విసురుగా గుడ్డలు పట్టాల పక్కనే ఉన్న రాళ్లమీద చిందరవందరగా పడి, వీస్తున్న గాలికి కాయితాలు వణుకుతూ కొట్టుకుపోవటం మొదలెట్టాయి.

రెడ్డప్ప త్వరగా బ్రీఫ్‌కేస్ దగ్గరకు వచ్చే లోపల కొన్ని కాయితాలు నిలబడిపోయిన బండి కిందకు వచ్చాయి. కొన్నింటిని వెంటనే దొరకబుచ్చుకుని ఎగిరి పోకుండా వాటి మీద రాళ్లు పెట్టి కంపార్టుమెంట్ కిందకు చూశాడు. ఎం.ఎ. డిగ్రీ సర్టిఫికేట్ అవతలి వైపు చక్రం లోపలి భాగానికి అతుక్కుని గాలికి రెపరెపలాడుతోంది. అది లేకపోతే తనకు ఉద్యోగం రాదు. మనసు విలవిలలాడుతుంటే వంగి కంపార్టుమెంట్ కిందకు మొండి ధైర్యంతో వచ్చి రక్తసిక్తమైన కుడిచేయి చాచి సర్టిఫికెట్ అందుకుంటుండగా చేయి జారి డిగ్రీ సర్టిఫికెట్ చక్రాన్ని దాటి గాలికి రైలుకట్ట దాటి మురికిగుంటవైపు గిరికీలు కొడుతూ ఎగిరింది. అంతలో సిగ్నలివ్వటంతో ఇంజన్ కూతవేసి కదిలింది.

◆ సైనిక సమాచార్, సచిత్ర వార పత్రిక, 14 మే, 1978